# శిక్ష

ఎన్. శివనాగేశ్వరరావు




"రావులమ్మా! గుడిసెలో దాసుగాడున్నాడా?" ఉదయాన్నే ఇద్దరు పోలీసులు. చేతుల్లో లాఠీలతో ప్రత్యక్షమై దాసు గురించి ఆరా తీసేసరికి, రావులమ్మ గుండె గుభేల్‌మంది. ఈ బడిద్దాయి కొంపమునిగే పని ఏం చేసాడోనని భయపడుతూ "లోన తొంగున్నాడయ్యా!" అంది వినయంగా.

"పోయి వాడ్ని లేపుకురా!! ఇన్‌స్పెక్టర్‌గారు ఉన్నపళాన్న వాడ్ని తెమ్మన్నారు" అన్నాడో పోలీసు.

"అట్టానే బాబూ!" అని రావులమ్మ గుడిసెలోకి పోయి "ఒరే దాసూ! లేచి చావరా! నీ కోసం పోలీసులు వచ్చారు" అని తట్టి లేపింది.

"పోలీసులు" అన్న మాట వినగానే దాసుకి నిద్రమత్తు వదిలిపోయింది. గభాల్న లేచి కూర్చున్నాడు. రావులమ్మ వాడి గెడ్డం పుచ్చుకొని "చెప్పరా నాన్నా! ఏం చేసి వచ్చావు? నీ కోసం పోలీసులు ఎందుకొచ్చారు?" అని బుజ్జగించింది.

దాసు, తల్లి వంక ఉరిమిచూసి "నేనే తప్పుడు పనీ చేయలేదే! వాళ్లెందుకొచ్చారో నాకు మాత్రం ఏం తెలుసు?" అని లుంగీతోనే బయటకొచ్చాడు. అక్కడున్న పోలీసులను చూడగానే సేల్యూట్ చేసి "ఏంటి సార్లూ! పొద్దున్నే వచ్చారు? ఏటి కథ?" అన్నాడు. వచ్చిన పోలీసులతో వాడికి బాగానే చనువుంది.

"కథ ఏంటో మాకూ తెలీదురా! ఎస్సయిగారు మాత్రం నిన్ను అర్జంట్‌గా పట్రమ్మని హుకుం జారీ చేశారు చేసారు" అన్నాడో పోలీసు. "అయితే పదండి. అయ్యగారి దర్శనం చేసుకుంటాను" అని దాసు గుడిసె లోపలకు పోయి లుంగీ మార్చి ప్యాంట్ వేసుకొచ్చాడు.

రావులమ్మ పోలీసులతో పాటు నాలుగు అడుగులు వేసి "బాబూలూ! నా కొడుక్కి ఏ ఆపదా రాలేదు కదా?" అని అడిగింది. "ఏం లేదులే రావులమ్మా! ఏదో మామూలు పని. ఓ గంటలో వచ్చేస్తాడులే!' అని భరోసా ఇచ్చాడో పోలీసు. అంతటితో రావులమ్మ గుండె కుదుటపడింది.

దాసు సినిమా హాల్లో పనిచేస్తున్నట్లు మాత్రమే తెలుసు ఆ ముసిల్దానికి. నిజానికి దాసు సినిమా హాల్లో పని చేయడంలేదు. హాల్ ముందు బ్లాక్‌లో టిక్కెట్లు అమ్ముతుంటాడు.

అంతకు ముందయితే జేబులు కొట్టేవాడు. కొన్నిసార్లు జనం... మరికొన్ని సార్లు పోలీసులు వాడి ఒళ్లు హూనం చేసారు. అందుకే... ఆ వృత్తి కంటే బ్లాక్‌లో టిక్కెట్లు అమ్ముకోవడం గౌరవప్రదంగా భావించి వాడు ప్రొఫెషన్ మార్చాడు.

అందుకే పోలీసులతో వాడికి కనెక్షన్లు ఉన్నాయి. వాళ్ల మామూళ్లు ఏ రోజుకారోజు చెల్లించేస్తుంటాడు. అయితే ఎస్సైగారి దగ్గిరి నుంచి కబురెందుకు వచ్చిందో వాడికి అర్థం కాలేదు.

పోలీస్ స్టేషన్‌లోకి ప్రవేశించగానే దాసు ఎస్సై అర్జున్‌రావుగారికి సేల్యూట్ కొట్టి వినయంగా చేతులు కట్టుకు నిలబడ్డాడు. 'ఏరా! ఎలా ఉంది బిజినెస్?" అని అడిగాడు ఎస్సై. 'ఏదో తమదయ' అన్నాడు దాసు. ఆ మాటకు ఎస్సై ముఖం సీరియస్‌గా పెట్టి "ఆ మాట మరోసారి అనకు. నీవు చేసే వెధవ పనికి నా దయేంటి?" అన్నాడు. "తప్పయిపోయింది సార్!" అని దాసు ఒక చేత్తో నోరుమూసుకున్నాడు.

"ఈరోజు అలంకార్ థియేటర్ సెకండ్‌షోకి ఫేమిలీతో వస్తున్నాను. బాల్కానీ టిక్కెట్లు అయిదు ఏర్పాటు చేయి" అన్నాడు అర్జున రావు. దాసుకి విషయం అర్థమయింది. బ్లాక్‌లో టికెట్ల అమ్ముతున్న నేరానికి మామూళ్లు గుంజడమే కాకుండా అయిదు బాల్కానీ టిక్కెట్లు ఖర్చు తన నెత్తిన రుద్దబోతున్నాడు అనుకున్నాడు. తన భావాలు ముఖంలో కనబరచకుండా పెదవుల మీదకు చిరునవ్వు తెచ్చుకొని "తప్పకుండా సార్! మరి డబ్బు..." అని గొణిగాడు.

అర్జునరావు వాడివంక సీరియస్‌గా చూసి "ఏం బే! వేషాలు వేస్తున్నావా? నీకు డబ్బులు ఇవ్వడమేంటి? ఎముకలు విరుగుతాయి" అన్నాడు.

"క్షమించాలి. డబ్బుకు కొంచెం కటకటగా ఉంది" అన్నాడు దాసు. "త్రినాట్ నైన్! వీడ్ని బొక్కలో తోసేయి" అన్నాడు ఎస్సై. 'కోపగించకండి సార్! మీ బాంచను. అలానే టిక్కెట్స్ అరేంజ్ చేస్తాను" అన్నాడు దాసు. 'మంచి సీట్లు చూడు' అన్నాడు ఎస్సై. దాసు వినయంగా తలూపి బయటకు వచ్చాడు.

త్రినాట్ నైన్, దాసు జేబులో చేయి పెట్టి ఒక సిగరెట్ బయటకు లాగి వెలిగించాడు. దాసు తనో సిగరెట్ వెలిగించి "అన్నా! ఓ వారం ఆగితే సార్‌కి ఫ్రీపాస్ ఇస్తారు కదా! అందాకా ఆగవచ్చు కదా!" అన్నాడు.

త్రీనాట్ నైన్ చిరునవ్వు నవ్వి 'ఒరే దాసూ! అప్పటిదాకా అయ్యగారి సెకండ్ ఫేమిలీ అగలేద్రా!' అన్నాడు. "అయ్యగారు సినిమాకి వస్తున్నది సెకండ్ ఫేమిలీతోనా?" అని గొణిగాడు దాసు. త్రీనాట్ నైన్ కన్నుగీటి "ఫిగర్ బాగుంటుందిరా" అన్నాడు. దాసు కూడా నవ్వి "ఎలాగుంటే మాత్రం మనకేం లాభమన్నా! ఆమె పక్క సీట్లో కూర్చునేది అయ్యగారు గాని మనం కాదుగా!" అన్నాడు. త్రినాట్నైన్ దాసు భుజం చరిచి 'జోకు బాగుందిరా!' అన్నాడు.

దాసు గుడిసె చేరాడు 'ఏందిరా అయ్యా! ఎస్సయి బాబు నిన్నెందుకు పిలిపించాడు? అని ఆదుర్దా పడింది రావులమ్మా. 'కంగారు పడకే! ఏదో సినిమా హాలు పని!" అన్నాడు దాసు రావులమ్మ నమ్మింది.

రాత్రి సెకండ్ షోకి అర్జున రావు సెకండ్ సెటప్‌తో వచ్చి దర్జాగా సినిమా చూశాడు. బాల్కానీ టిక్కెట్టు పదిహేను రూపాయలు. అయిదు టిక్కెట్లు డెబ్బయి అయిదురూపాయలు. దాసు గుండె రగిలి పోయింది. ఆ రోజు వాడికి పైసాలు మిగలకపోగా మరొకడి దగ్గర యాభై అప్పు తీసుకోవలసి వచ్చింది.

సెకండ్ షో బుకింగ్ క్లోజ్ అయ్యాక వాడు సారా కొట్టుకు పోయాడు. అక్కడా వాడికి చెక్కెదురు అయింది. బాకీ చాలా ఉంది. డబ్బిస్తే గాని సారా పొయ్యనని షాపువాడు చాలా ఖరాఖండీగా చెప్పేశాడు. దానితో దాసుకి ఎస్సయి మీద కసి మరింత పెరిగింది.

గుడిసె చేరి, నులక మంచం మీద నడుం వాల్చాడే గాని వాడికి నిద్రపట్టలేదు. జీతాలు తీసుకుంటూ, మామూళ్లు గుంజుతూ, మరలా సినిమా టిక్కెట్లకు కక్కుర్తి పడి ఓ పేదవాడి కడుపు కొట్టడం అమానుషంగా అనిపించింది. ఎస్సైని ఎలాగైనా దెబ్బతీయాలనుకున్నాడు దాసు. చాలాసేపు ఆలోచించాక వాడికో ఆలోచన వచ్చింది. అలా చేయాలనుకుంటూ తృప్తిగా నిదురపోయాడు.

మరునాడు చేయబోతున్న పని తాలూకు సమాచారం సేకరించాడు. ఆ మరునాడు ఎస్సై ఇంటికి ఫోన్ చేసి ఫోన్ ఎత్తినది ఎస్సైగారి అసలు భార్యేనని నిర్ధారించుకున్నాక వాడు తన స్వరం అమ్మాయి స్వరంలా మార్చాడు. వాడికా విద్యలో మంచి ప్రావీణ్యముంది. 'మేడం! మొన్న సెకండ్ షోకి మీవారు మరోదానితో వెళ్లారు. మీవంటి అందెగత్తెను వదిలి అటువంటి బజారు దానితో సినిమాకి వెళ్లడం ఎంత ఛండాలం? నిజం చెబుతున్నాను. మీమీద ఆయనకేమాత్రం మోజులేదు. ముడుపులన్నీ దానికే సమర్పిస్తున్నారు. దాని మోజులన్నీ తీరుస్తున్నారు. మీరు ఇలాగే ఊరుకుంటే మీ సంసారం నాశనం కావడానికి అట్టే కాలం పట్టదు. జాగ్రత్త పడండి" అని ఫోన్ పెట్టేశాడు.



## ఏమీ మారలేదు!

"మీ ఆయన ఎక్కడే అమ్మాయి?" పొద్దుటే ఊరు నుంచి వచ్చిన పిన్నిగారు అడిగింది పద్మని. .

"గ్రౌండుకి రన్నింగు చేయడానికి వెళ్లారు" అంది పద్మని.

"వాడు చిన్నప్పట్నుంచీ అంతే. బజారుకెళ్లి వస్తువులు తేరా అంటే రన్నింగు, స్కూలుకి వెళ్లడానికి రన్నింగు. నిన్ను పెళ్లి చూపులు చూడ్డానికీ పరుగే. వాడేం మారలేదన్నమాట పెళ్లి అయినా కూడా" సాలోచనగా అంది పిన్నిగారు.

**- పి. సరోజ** (అమలాపురం)

తాను అరేంజ్ చేసిన బాంబ్ దారుణంగా విస్ఫోటనం చెంది ఎస్సై మనశ్శాంతికి విఘాతం కలిగిస్తుందని దాసు గట్టిగా నమ్మాడు. తను ఫోన్ చేసినట్టు వాడు తెలుసుకోలేడు. తన కడుపు కొట్టినందుకు వాడి గుండె మీద కొట్టాడు. ప్రతీకారం తీర్చుకున్నట్లే! దాసు ఈల వేసుకుంటూ సినిమా హాలు దగ్గరకు పోయాడు.

మారునాడు దాసుకి ఎస్సై దగ్గర నుంచి రమ్మని కబురు వచ్చింది. ఈసారెందుకు పిలిపించి ఉంటాడు? కొంపదీసి తను ఫోన్ చేసిన విషయం తెలిసిపోలేదు కదా? అనుకున్నాడు దాసు. అయితే ఆ అవకాశం లేదని మనసుకు గట్టిగా ధైర్యం చెప్పాడు.

దాసు ఎస్సై దగ్గరకు వెళ్లి సేల్యూట్ కొట్టి వినయంగా చేతులు కట్టుకు నిలబడ్డాడు. "ఒరే దాసూ! నీతో మరలా పని పడింది. అలంకార్ థియేటర్‌కి సెకండ్ షోకి ఈ రోజు ఫేమిలీతో వస్తున్నాను. పది టిక్కెట్లు అరేంజ్ చేయి" అన్నాడు ఎస్సై. దాసు గుండెలో రాయి పడింది. ఇది వాడు ఊహించని పరిణామం. 'అయ్యా! మొన్ననే కదా ఫేమిలీతో సినిమా చూసారు" అన్నాడు.

అర్జున రావు దాసువంక చూసి అదోలా నవ్వాడు. "మొన్న వెళ్లింది చిన్నమ్మ గారితోరా! ఆ ఇన్ఫర్మేషన్ ఎవడో పుండాకోర్ పెద్దమ్మ గారి చెవిన వేశాడు. అది తెలిసి పెద్దమ్మ గారు రగడ చేశారు. అందుకే ఆవిడ తాలూకు బంధువర్గంతో సహా ఈ రోజు బయలుదేరవలసి వచ్చింది" అన్నాడు.

"టిక్కెట్లు తప్పక ఏర్పాటు చేస్తాను సార్!" అని దాసు పోలీస్ స్టేషన్ నుంచి బయటకు వచ్చాడు. లేకపోతే ఎస్సైమూడు ఎటు మారుతుందోననపించింది. వీడు రిస్క్ తీసుకోదలచలేదు. అందుకే త్వరగా బయటపడ్డాడు. వీడి మనోపథంలో ఎస్సై నవ్విన నవ్వు మెదులుతున్నది. ఆ నవ్వు భావం వాడికి స్పష్టంగా అర్థమయింది. ఎస్సై ఆవులిస్తే పేగులులెక్కపెట్టే ఘనుడు. తాను ఫోన్ చేసిన సంగతి వీడికి తెలిసి పోయింది. అయినా తిట్టలేదు. కొట్టలేదు. సెల్‌లో పడయలేదు. పది టిక్కెట్లు ఏర్పాటు చేయమని ఆదేశించాడు. నూటయాభై ఖర్చు. ఈ "శిక్ష" ఒక్కరోజుతో తప్పేది కాదని దాసు బాగానే గ్రహించాడు.

వాడు గుడిసె చేరగానే "ఒసే అమ్మా! ఈ ఊళ్లో బ్రతకడం చాలా కష్టంగా ఉంది. మూటాముల్లె సర్దు. మరో ఊరుపోదాం" అని కుక్కి మంచం మీద వాలిపోయాడు. ●

